ప్రజా విశ్వంభర V3 NEWS లక్ష్యం సమాజహితం

అగ్నిమాపక సేవల వారోత్సవాలు ప్రారంభం

విశ్వంభర, సంగారెడ్డి: అగ్నిమాపక సేవల వారోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదాల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి. నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం జరిగిన వారోత్సవ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా పలు ప్రదేశాల్లో మాక్ డ్రిల్లులు, అవగాహన ర్యాలీలు, శిక్షణ కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ప్రజలు అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.1944 సంవత్సరంలో బాంబే నగరంలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో వీరమరణం పొందిన అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20 వరకు “అగ్నిమాపక సేవల వారోత్సవం”ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ర్యాలీలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, ఫంక్షన్ హాళ్లు, సినిమా థియేటర్లు, మాల్స్ మరియు ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో మాక్ డ్రిల్లులు చేపట్టనున్నట్లు తెలిపారు. మాక్ డ్రిల్లులు నిర్వహించే ప్రదేశాల్లో పాంప్లెట్లు, బ్రోచర్లు పంపిణీ చేసి అవగాహన కల్పిస్తారని, గృహాలు, కార్యాలయాల్లో తీసుకోవాల్సిన అగ్ని భద్రతా చర్యలపై శిక్షణ కార్యక్రమాలు, అగ్ని ప్రమాదాల సమయంలో అనుసరించాల్సిన జాగ్రత్తలపై ప్రదర్శనలు నిర్వహిస్తారని తెలిపారు. మంగళవారం ఉదయం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, పటాన్‌చేరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని అగ్నిమాపక సేవల వారోత్సవాల పాంప్లెట్లు, పోస్టర్లను ఆవిష్కరించి వారోత్సవాన్ని ప్రారంభించారు .గత సంవత్సరం (2025)లో సంగారెడ్డి జిల్లాలో మొత్తం 576 అగ్ని ప్రమాదాలు సంభవించగా, అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి వాటిని అదుపులోకి తెచ్చారని ఆయన తెలిపారు. ఈ ప్రమాదాలలో సుమారు రూ. 5.08 కోట్ల ఆస్తి నష్టం సంభవించినప్పటికీ, సుమారు రూ. 5.09 కోట్ల విలువైన ఆస్తిని రక్షించడంతో పాటు 63 మంది ప్రాణాలను కాపాడడం జరిగిందన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని , అలాగే ప్రమాద ప్రాంతానికి అనవసరంగా చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ వారోత్సవాన్ని విజయవంతం చేయడానికి జిల్లా ప్రజలందరూ సహకరించవలసిందిగా జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి. నాగేశ్వరరావు కోరారు.

ఆపదలోవున్నవారికి సాయం చేయాలి

- మల్లన్న జాతరలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

విశ్వంభర, సంగారెడ్డి: పట్టణం గొల్లగూడెంలో కొలువైన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీ ఐఐ సీ చైర్ పర్సన్ నిర్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భముగా ఆయన మాట్లాడుతూ, ఏ కులమైనా, ఏ దేవుడైనా.. ఆపదలో వున్నవారికి సాయం చేయాలన్నదే ప్రధాన ఉద్దేశమన్నారు, మల్లన్న, బీరప్ప దేవుళ్ళ కథల్లోని సారాంశం కూడా ఇదే అని దీనిని అందరం పాటిద్దామని అన్నారు. కులాలు అనే తేడా లేకుండా అందరూ కలిసి మెలిసి జీవించాలన్నదే మల్లన్న, బీరప్ప కథల్లో వున్న సందేశమని జగ్గారెడ్డి వివరించారు . ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు చెప్పిన మల్లన్న, బీరప్ప ఒగ్గు కథలను ఆసక్తిగా జగ్గారెడ్డి విన్నారు. ఈ కల్యాణోత్సవంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

విశ్వంభర, చేవెళ్ల : భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక సంస్కర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని మొయినాబాద్, షాబాద్ మండలాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మొయినాబాద్ మండలం సజ్జన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్లుగంటి మధుసూదన్ రెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా షాబాద్ మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో కూడా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, షాబాద్ మాజీ ఎంపిటిసి తమ్మలి రవీందర్, షాబాద్ సర్పంచ్ గుండాల అశోక్, షాబాద్ ఉపసర్పంచ్ దండు రాహుల్ గుప్తా, బీసీ సేన అధ్యక్షుడు బర్క కృష్ణ, సర్పంచ్ దివ్య మురళీధర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లావణ్య చెన్నయ్య, నర్సింలు, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, గౌరీశ్వర్, చంద్రపాల్, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్

విశ్వంభర, మహబూబాబాద్: అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని కోర్టు సెంటర్లో ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ భారత రత్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించి, రోడ్డు భద్రతకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కుల సంఘాల ప్రతినిధులు జిల్లాలోని ప్రజలు అన్ని విభాగాల సిబ్బంది తో కలిసి అంబేద్కర్ జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ, ప్రస్తుత యువత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగాలని అన్నారు. ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, మహబూబాబాద్ పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, కుల సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు మహిళా ఉద్యోగులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

- ఐటీడీఏ పీఓ రాహుల్

విశ్వంభర, భద్రాచలం: భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలు భారతదేశ చరిత్రలో అజరామరమని, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకమని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ అన్నారు. మంగళవారం ఐటిడిఏ కార్యాలయ సమావేశ మందిరంలో అంబేద్కర్ 135వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఉన్న అంటరానితనం, అసమానతలు, కుల వివక్షలను నిర్మూలించేందుకు అంబేద్కర్ చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. సమాన హక్కులు, సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారత కోసం ఆయన జీవితాంతం చేసిన పోరాటం దేశానికి దిశానిర్దేశం చేసిందని అన్నారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన చూపిన దూరదృష్టి పల్లే ప్రతి పౌరుడికి హక్కులు, రక్షణ కల్పించబడినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పనితీరులో ప్రతిబింబించాలని అన్నారు. డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో మరింత శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. ఆర్‌సిఓ గురుకులం అరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, పివిటీజి అధికారి గన్యా నాయక్, ఏపీఓ పవర్ వేణు తదితరులు కూడా అంబేద్కర్ సేవలను స్మరించుకొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డీఎం జీసిసి సమ్మయ్య, ఏ సీఎంవో రమేష్, ఏ డిఎంహెచ్ఓ సైదులు, ఏవో సున్నం రాంబాబు, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ, జయరాజ్, ఐటిడిఏ సిబ్బంది, పర్యవేక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైడ్రా చర్యలపై బీఆర్ఎస్ ఆగ్రహం

విశ్వంభర, సంగారెడ్డి: పటాన్‌చెరు నియోజకవర్గం ఐలాపూర్ గ్రామంలో హైడ్రా చేపడుతున్న కూల్చివేత చర్యలను, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ యువ నాయకుడు మాణిక్ యాదవ్‌కు చెందిన పార్టీ కార్యాలయాన్ని ప్రభుత్వ భూమి పేరుతో కూల్చివేయడం అన్యాయమని అన్నారు. ఆ స్థలం 1954 నుంచే తమ పూర్వీకుల సొంతమని, భూ భారతి పోర్టల్ సహా అవసరమైన పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధమని విమర్శించారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.మాణిక్ యాదవ్ కారును ధ్వంసం చేయడం, సిద్దు జీవనాధారమైన ఆర్వో ప్లాంట్‌ను కూల్చివేయడం ఖండనీయమని పేర్కొన్నారు. అదే సర్వే నంబర్‌లోని కొన్ని నిర్మాణాలను వదిలిపెట్టడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని సూచిస్తోందన్నారు. హైడ్రా చర్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ,రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములను స్పష్టంగా గుర్తించి చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో తుంట అంజయ్య యాదవ్, బాల్ రెడ్డి, కుమార్ గౌడ్, పరమేష్ యాదవ్, నర్సింహ, అప్పల భాస్కర్, రాజు, శ్రీనివాస్ రెడ్డి, బిజిలిపురం రాజు, పెద్ద రాజు, శివ, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిలిం టూరిజం అభివృద్ధికి కృషి చేస్తా

-ఎఫ్‌టిపిసి ఫిలిం టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ వింగ్ చైర్మన్ కోడే శ్రీచైతన్య

విశ్వంభర, బషీర్ బాగ్: ఫిలిం టూరిజం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని ఎఫ్‌టిపిసి ఫిలిం టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ వింగ్ చైర్మన్ కోడే శ్రీచైతన్య, డిజిటల్ అండ్ సెలెబ్రేషన్స్ స్టేటజీ చైర్మన్ సీహెచ్ హరిలీలా ప్రసాద్ స్పష్టం చేశారు. ఎఫ్‌టిపిసి ఫిలిం టెక్నాలజీ వింగ్ చైర్మన్‌గా కోడే శ్రీచైతన్య, డిజిటల్ అండ్ సెలెబ్రేషన్స్ స్టేటజీ చైర్మన్‌గా సీహెచ్ హరిలీలా ప్రసాద్ నియమితులైన సందర్భంగా ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిపిసి) ఆధ్వర్యంలోఫిలిం టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ వింగ్‌కు చైర్మన్ నియామకాన్ని పురస్కరించుకుని ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని మంగళవారం బషీరాబాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నప్రముఖ దర్శకుడు వి.సముద్ర మాట్లాడుతూ, ఫిలిం టూరిజం అభివృద్ధిలో అగ్రగామి అయిన ఫిల్మ్ అండ్ టెలివిజన్ కౌన్సిల్(ఎఫ్‌టిపిసి ఇండియా) నేడు భారత దేశంలోనే కాకుండా గ్లోబల్‌లో ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య జంగా, పి.వి.ఎస్. వర్మ కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ఫిలిం సమ్మిట్‌స్‌లు జరపడంలోను, ఫిలిం ప్రమోషన్‌స్‌లోను, ఫిలిం టూరిజం అభివృద్ధిలో నేడు నియమితులైన కోడే శ్రీచైతన్య, సీహెచ్ హరిలీలా ప్రసాద్ కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎఫ్‌టిపిసి ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య జంగా, పీవీఎస్ వర్మ మాట్లాడుతూ, డిజిటల్ రంగంలో విశేష అనుభవం కలిగిన కోడే శ్రీచైతన్య, సీహెచ్ హరిలీలా ప్రసాద్‌లు తమ పదవులకు మరింత వన్నె తెచ్చే విధంగా పనిచేయాలని పేర్కొంటూ వారిని అభినందించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా ప్రముఖ బాలివుడ్ నటీమణి అనీషా ముఖర్జి పాల్గొని కోడే శ్రీచైతన్య, సీహెచ్ హరిలీలా ప్రసాద్‌లకు నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా బిగ్‌బాస్ షానీ, నటి సేజల్, అన్నంగి రాజశేఖర్, జి.మధుకర్, ఎం.ఈశ్వరరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త స్వప్న కాస్వ, తెలంగాణ మీడియా ఛైర్మన్ కిరణ్ బెజాడి, రామిశెట్టి అప్పారావు పాల్గొని శ్రీచైతన్య, హరిలీలా ప్రసాద్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

విశ్వంభర, భద్రాచలం: భద్రాచలం పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ తన కార్యాలయంలో అగ్నిమాపక శాఖ సిబ్బందితో కలిసి వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ వారోత్సవాల ఉద్దేశ్యం ప్రజల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంపొందించడం, అప్రమత్తతను కల్పించడం అని తెలిపారు. ఈ సందర్భంగా మృనాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా చిన్న అజాగ్రత్త కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశముందని హెచ్చరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గడ్డివాములు, పొలాల్లో నిల్వ ఉంచే పొడి గడ్డి, తాటాకు ఇళ్లు వంటి చోట్ల అగ్ని ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉంటుందని చెప్పారు. పట్టణాల్లో హోటళ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, వాణిజ్య సముదాయాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, గ్యాస్ లీకేజీలు వంటి కారణాలతో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ప్రజలు గ్యాస్ సిలిండర్ల వినియోగంలో జాగ్రత్తలు పాటించడం, విద్యుత్ వైర్లను సరిగా నిర్వహించడం, అవసరం లేని సమయంలో విద్యుత్ ఉపకరణాలను ఆఫ్ చేయడం వంటి సాధారణ చర్యల ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలను అగ్నితో ఆడనీయకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, పొగత్రాగేవారు సిగరెట్ ముక్కలను నిర్లక్ష్యంగా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇంటి వద్ద అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వెంటనే మెయిన్ స్విచ్ ఆఫ్ చేయడం, గ్యాస్ సరఫరాను నిలిపివేయడం, నీరు లేదా ఇసుకతో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించడం వంటి ప్రాథమిక చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. పెద్ద అగ్ని ప్రమాదాల సమయంలో స్వయంగా ప్రయత్నించకుండా వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎండి. సాధిక్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది రమేష్, కుమార్, వెంకట్రామిరెడ్డి, హరీష్, ప్రకాష్, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ లో ఘనంగా అంబేద్కర్ జయంతి

విశ్వంభర, మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాలు, రాజకీయ పార్టీలు, దళిత సంఘాలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రాజీవ్ భవన్ లో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్ని కుల సంఘాల, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి రాజీవ్ చౌక్ నుంచి బస్టాండ్ లో గల అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి,అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.అనంతరం నాయకులు, సంఘాల నాయకులతో కలిసి ప్రాంగణంలో న్యాయ భోజ్ సహ పంక్తి భోజనాలు చేశారు. అనంతరం బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్త దాన శిబిరం నిర్వహించారు. అనంతరం ఉచిత పెరుగన్నం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మిరియాల మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ మరియు వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మిర్యాలగూడ నియోజకవర్గ అన్ని కుల సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు, అంబేద్కర్ గారి అభిమానులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు , కార్యకర్తలు, బి ఎల్ ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

బండ కొత్తపల్లిలో అంబేద్కర్ జయంతి

విశ్వంభర, గుండాల : బండకొత్తపల్లి గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుండాల ఎస్ ఐ హాజరయ్యారు. గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు.

సదాశివపేటలో అంబేద్కర్ జయంతి

విశ్వంభర, సదాశివపేట : భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గొంగ్లూరి ప్రభు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్ని పార్టీల నాయకులు అధికారులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన భారతదేశానికి చేసిన సేవలను ఘనంగా కీర్తించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, మున్సిపల్ కమిషనర్ శివాజీ మున్సిపల్ సిబ్బంది పట్టణ సీఐ వెంకటేశం పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకుల చేత ప్రతిజ్ఞ చేయించారు అనంతరం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

డిండి లో ఘనంగా అంబేద్కర్ జయంతి

విశ్వంభర, డిండి: మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్ గౌడ్, ఎస్ ఐ బాలకృష్ణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శైలేష్, సర్పంచి సల్లగంతులు రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డమీది సాయి, ఉప సర్పంచ్ కౌసర్ రషీద్, మాజీ ఎంపీటీసీ రాధిక కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ నూకం వెంకటేష్, బి ఆర్ ఎస్ టౌన్ అధ్యక్షుడు గిరామైనీ శీను, బిజెపి దేవరకొండ కన్వీనర్ కృష్ణ, శ్రీనివాసులు, విజయ్ కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్ గౌడ్, జనార్ధన్, అవుట మల్లేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ను రీ ఓపెన్ చేయాలి

విశ్వంభర, కాచీగూడ: కాచీగూడ ఎస్సీ బాలుర హాస్టల్‌ను కరోనా సమయంలో మూసివేశారని ప్రొఫెసర్ గిరన్న ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి రీ ఓపెన్ చేయలేదన్నారు. ఈ హాస్టల్ మళ్లీ ప్రారంభిస్తే భావితరాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఇందులో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగారని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఇంకా ఎందరో ఉన్నత స్థానంలో ఉన్నవారు ఇందులోనే చదువుకున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాస్టల్‌ను రీ ఓపెన్ చేయాలని ఆయన కోరారు.

చలివేంద్రాలు ప్రారంభం

విశ్వంభర, నెల్లికుదురు: మండలంలోని కాస్య తండా, మునిగలవీడు గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కాస్య తండాలో సర్పంచి బోడ నర్సింహ నాయక్ అధ్యక్షతన ఎస్సై చిర్ర రమేష్ బాబు చలివేంద్రం ప్రారంభించగా, మునిగలవీడులో సర్పంచి బొల్లికొండ చైతన్య నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవి దృష్ట్యా గ్రామస్తులు, బాటసారులు ఈ చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కాస్య తండాలో జి పి కార్యదర్శి చిరంజీవి,ఉపసర్పంచ్ బానోతు నవీన్, మాలోతు హుస్సేన్, సుధాకర్, వెంకన్న, మునిగలవీడులో ఉపసర్పంచి మల్లయ్య, కార్యదర్శి అలీ, వార్డు సభ్యులు నల్లాని పాపారావు,నర్మదా కళ్యాణి, నాయకులు గిరగాని బిక్షపతి గౌడ్,ఇసంపల్లి వెంకటేష్, తుప్పతూరి రాజు, మాసెట్టి నవీన్,రవి,రాజశేఖర్, తదితరులు ఈ కెర్యక్రమాల్లో పాల్గొన్నారు.